# భద్రాద్రి రామయ్యకు స్వర్ణహారం



భద్రాద్రి ఆలయ ఉప ప్రధానార్చకుడికి హారాన్ని అందజేస్తున్న పువ్వాడ నయన్‌రాజ్

భద్రాచలం/ ఖమ్మం, ఏప్రిల్ 17 : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బంగారంతో పొదిగిన పచ్చల హారాన్ని స్వామివారికి పంపారు. బుధవారం ఉదయం మంత్రి అజయ్ కుమారుడు పువ్వాడ నయన్‌రాజ్ ఆలయానికి విచ్చేసి దేవస్థానం ఉప ప్రధానార్చకుడు అమరవాది మురళీకృష్ణమాచార్యులకు ఆ హారాన్ని అందజేశారు. స్వామివారి సేవల్లో దానిని ధరింపజేయాల్సిందిగా ఆలయ అధికారులను కోరారు. భద్రాద్రి రామయ్య మీద ఉన్న భక్తితోనే హారాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు.



ఖమ్మం నగరంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు

# జగదానంద కారకా.. జయ జానకీ ప్రాణ నాయకా..

## భద్రాచలంలో వైభవోపేతంగా సీతారాముల కల్యాణం

**వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించిన అర్చకులు**

**కల్యాణ ఘట్టాన్ని కనులారా వీక్షించి పులకించిన భక్తజనం**

**'శ్రీరామ్.. జైజై రామ్' అంటూ జయజయ ధ్వానాలు**

**రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎస్ శాంతికుమారి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్**



స్వామివారికి ముత్యాల మాల వేస్తున్న అర్చకులు



ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సీఎస్ శాంతికుమారి



భద్రాచలంలో సీతారామచంద్రులపై పూలు చల్లుతున్న అర్చకులు

జనసంద్రమైన భద్రగిరి భక్తిభావంతో ఉప్పొంగింది. జగదానంద కారకుడి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ క్రతువును కనులారా వీక్షించిన భక్తజనం పులకించిపోయింది. పుణ్య పురుషుడిని.. ఆదర్శ పాలకుడిని మదినిండా తలుస్తూ భక్తజనం స్వామివారి సేవలో తరించింది. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో చూడచక్కగా అలంకరించిన వేదికపై మొదలైన సీతారామచంద్రస్వామి కల్యాణ క్రతువులో అన్ని ఘట్టాలనూ భక్తిశ్రద్ధలతో తిలకించి తన్మయత్వం పొందారు. 'శ్రీరామ్.. జైజై రామ్..' అంటూ జయజయ ధ్వానాలు చేశారు. దేవతామూర్తులకు పట్టు వస్త్రాల సమర్పణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు పోసే వేడుకలను సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించారు.

*- ఖమ్మం, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



కల్యాణాన్ని తిలకిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి





స్వామివారికి మొక్కుతున్న ఎంపీ మాలోతు కవిత



మిథిలా స్టేడియంలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



ఖమ్మంలో స్వామివారికి మొక్కుతున్న మంత్రి తుమ్మల



స్వామివారికి పూలు, తలంబ్రాలు తీసుకొస్తున్న కనుమూరి బాపిరాజు

ఖమ్మం, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణం బుధవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. 'శ్రీరామ.. జయరామ.. జయజయ రామ' నామస్మరణలతో భద్రగిరి మార్మోగింది. కల్యాణ ఘడియ కోసం రెండు రోజులుగా ఎదురుచూస్తున్న భక్తజనం కల్యాణ రాముడిని పెండ్లి కుమారుడిగా, సీతమ్మ తల్లిని పెండ్లికుమార్తెగా వేదికపై దర్శనం చేసుకుని తరించారు. భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో శిల్పకళా శోభితమైన కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. భక్తులకు సీతారామ కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు రెండు కనులూ చాలలేదు. భక్తి పారవశ్యంతో తన్మయత్వం పొందారు. ఈ వేడుక కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్చకస్వాముల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ నయనానందకరంగా సాగిన స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మిక ఒడిలో ఓలలాడించింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కల్యాణ క్రతువు మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొనసాగింది. శ్రీరాముడు, సీతాదేవి వధూవరులుగా ఆశీనులైన మిథిలా స్టేడియం వైకుంఠాన్ని తలపించింది. దేవాలయ అర్చకులు తెల్లవారుజామున 2 గంటలకే దేవాలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, నివేదన, షాత్తుముర్రై, మూలవరుల అభిషేకం, మంగళశాసనాలు జరిపించారు. అనంతరం గర్భగుడిలోని మూలమూర్తులకు పూజలు నిర్వహించారు. తర్వాత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులను గావించి భక్తుల కోలాహలం, మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా అత్యంత వైభవంగా జరిపించారు. సీతారామచంద్రస్వామివార్ల గొప్పతనాన్ని వర్ణిస్తూ, సీతమ్మతల్లి అణకువను వివరిస్తూ కల్యాణ ఘట్టం అంగరంగవైభవంగా సాగింది. కాగా, కల్యాణ క్రతువులో సీతారాముల కల్యాణ మహోత్సవ విశిష్టతను, భద్రాద్రి క్షేత్ర ప్రాశస్త్యాన్ని, భక్తరామదాసు సేవలను, ఆయన భక్తితో సీతారాములుకు చేయించిన బంగారు ఆభరణాల చరిత్రను వేదపండితులు భక్తులకు వివరించారు. సీతమ్మ వారికి కల్యాణం రోజు దేశంలో ఎక్కడైనా రెండు మంగళసూత్రాలను మాత్రమే ధరింపచేస్తారు. కానీ.. భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవంలో మాత్రం సీతమ్మ వారికి శ్రీరాముడు కట్టే పుస్తెల తాడులో మూడు సూత్రాలు ఉంటాయి. ఒకటి జనకమహారాజు, మరొకటి దశరథమహారాజు చేయించిన పుస్తెలు కాగా.. భక్తరామదాసు సీతమ్మతల్లిని తన కుమార్తెగా భావించి చేయించిన మూడో సూత్రాన్ని కలిపి రామయ్య తండ్రి సీతమ్మతల్లి మెడలో మాంగళ్యధారణ గావించారు.

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్, పీఎస్

సీతారాముల కల్యాణ మహోత్సవంలో శ్రీరామచంద్రుడికి, సీతమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున టీటీడీ అధికారులు కూడా పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణ మహోత్సవంలో వ్యక్తిగత హోదాలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నరసింహన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు రఘునాథ్ తిహారి, శ్రీనివాసరెడ్డి, ఎం.హరినాథ్, మండవ కిరణ్మయి, జగడం సుమతి, మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆలయ ఈవో రమాదేవి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

### నేటి పట్టాభిషేకానికి గవర్నర్..

భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో శ్రీరాముడి మహాపట్టాభిషేకాన్ని గురువారం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవం మరునాడే అదే వేదికపై భక్తుల సమక్షంలో మహాపట్టాభిషేకాన్ని నిర్వహించడం ఆనవాయితీ. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ వేడుక జరుగనుంది. పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. గవర్నర్ పర్యటన కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు.

### పలు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు..

ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారి కోసం దేవస్థానం అధికారులు సకల ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. వసతి సౌకర్యాల కోసం ఎదురుచూడకుండా గోదావరి పక్కన ఇసుక తిన్నెలనే పట్టుపాన్పులుగా భావించి విశ్రమించారు. తెల్లవారుజామున పావన గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దేవాలయానికి చేరుకుని దేవదేవుడిని దర్శించుకున్నారు. కల్యాణానికి తరలివచ్చిన భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

### రామయ్య కల్యాణం సైడ్‌లైట్స్

- పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి సమాచారం లేకుండానే మంత్రులు, ఎమ్మెల్యేలు సీతారాముల కల్యాణానికి వచ్చారు.
- వారికి నమస్కారం పెడితే ఏమవుతుందో అనే ఉద్దేశంతో ఎవరికి వారే దూరంగా ఉండిపోయారు.
- రామయ్య కల్యాణాన్ని తిలకించడానికి అధికారులు ఈసారి తమ హవా కొనసాగించారు.
- జ్యుడీషియల్ విభాగం నుంచి పలువురు న్యాయమూర్తులు కల్యాణానికి హాజరయ్యారు.
- సింగరేణి సీఎండీ బలరాం ఎలాంటి ఆర్భాటం లేకుండా ఒక్కరే వచ్చారు.
- మహబూబాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత సైతం ఒంటరిగానే పెళ్లికి వచ్చారు.
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులు, మంత్రులు పొంగులేటి దంపతులు, కొండా సురేఖతోపాటు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు.
- మంత్రి కొండా సురేఖ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.
- మంత్రులకు ప్రొటోకాల్ లేకపోయినా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.
- సెక్టార్లలో ఉన్న జిల్లా అధికారులకు వాకీటాకీలు ఇవ్వడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగలేదు.
- ఎండ వేడి విపరీతంగా ఉండడంతో భక్తుల సంఖ్య గత ఏడాది కంటే తగ్గింది.
- పాస్‌లు లేకుండా నాలుగు చక్రాల వాహనాలను అనుమతించకపోవడంతో వయస్సులో ఉన్న పెద్దవారు ఇబ్బందిపడ్డారు.
- మీడియా గ్యాలరీలో అంతా బయటి వ్యక్తులే దర్శనమిచ్చారు.
- కల్యాణానికి వచ్చిన భక్తులకు అల్పాహారం, భోజనాలను స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేశాయి.
- ఆంధ్రా నుంచి వచ్చిన బస్సులను భద్రాచలం డిపోలోకి అనుమతించలేదు. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురయ్యారు.


*–భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ)*

# పర్ణశాల రామయ్య కల్యాణం



పర్ణశాలలో రామయ్య కల్యాణ క్రతువు జరిపిస్తున్న అర్చకులు

పర్ణశాల, ఏప్రిల్ 17 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో సీతారాముల కల్యాణం ఎంతో రమణీయం.. కమనీయంగా జరిపించారు. కల్యాణ మంటపం వద్ద రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించిపోయారు. స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని పర్ణశాల రామయ్య కల్యాణం వేదశాస్త్రాల నడుమ వైభవంగా జరిగింది. గర్భాలయంలోని ధ్రువమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. భద్రాచలం ఆలయ అధికారి ఏఈవో శ్రావణ్‌కుమార్ దంపతులు ప్రభుత్వం తరఫున సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. అదేవిధంగా భక్తులు కూడా పట్టువస్త్రాలు సమర్పించారు. మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా కల్యాణ మంటపానికి తీసుకొచ్చారు. అభిజిత్ లగ్నమందు 12గంటలకు సీతారాముల శిరస్సుపై జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని పెట్టి కల్యాణతంతును నిర్వహించారు. సీతారాముల పరిణయ వేడుక, మాంగళ్య ధారణ తంతును భక్తులకు అర్చకులు ఎంతో వివరంగా వివరిస్తూ వైభవంగా జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరాగా వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు పెద్ద నల్లబెల్లి ముత్యాలమ్మ ఆలయం వద్ద కమిటీ వారు పానకం, మజ్జిగను అందించారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, పూల దండలు సమర్పిస్తున్న ఆలయ అధికారులు



పర్ణశాలలో సీతమ్మవారి విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు

# నేడు రామయ్య మహా పట్టాభిషేకం

## పట్టువస్త్రాలు సమర్పించనున్న గవర్నర్

భద్రాచలం, ఏప్రిల్ 17 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. శ్రీరాముడు జన్మించిన పునర్వసు నక్షత్రం రోజున ప్రత్యేక పూజలు చేసి మరునాడు వచ్చే పుష్యమి నక్షత్రం రోజున రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ.

### గవర్నర్ పర్యటన వివరాలు..

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ గురువారం ఉదయం 7:45గంటలకు రాజ్‌భవన్ నుంచి బయలుదేరి 7:55కు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. 8గంటలకు హెలికాప్టర్ ఎక్కి 9:15 గంటలకు భద్రాచలం పట్టణంలో ఏర్పాటుచేసిన హెలీపాడ్ వద్దకు చేరుకుంటారు. 9:20కి హెలీపాడ్ నుంచి బయలుదేరి 9:30 ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని అక్కడే అల్పాహారం చేస్తారు. 9:45గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చేరుకొని 9:50 రామయ్యను దర్శించుకుంటారు. దర్శనం అనంతరం 10గంటలకు పట్టాభిషేకం జరిగే మిథిలా స్టేడియంకు చేరుకుని పట్టాభిషేకంలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 12:30 గంటలకు పట్టాభిషేకం పూర్తికాగానే అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 12:40కి ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ లంచ్ పూర్తిచేసి, కాసేపు విశ్రాంతి తీసుకొని 2గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 2:10కి భద్రాచలం హెలీపాడ్ వద్దకు చేరుకుంటారు. 2:15కు భద్రాచలం హెలీపాడ్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 3:30 గంటలకు హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. ఎయిర్‌పోర్ట్‌లోని వీవీఐపీ లాంజ్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని 4:45కు విమానంలో చెన్నైకు చేరుకుంటారు.

# క్యూరింగ్‌కు ఫిల్టర్ బెడ్ వాటర్

- **మరోవైపు సింగరేణి ఏరియా కార్మిక కాలనీల్లో తీవ్రంగా తాగునీటి సమస్య**
- **దాన్ని పరిష్కరించకుండా క్వార్టర్ల నిర్మాణానికి ఫిల్టర్ బెడ్ వాటర్ వినియోగం**




ఫిల్టర్‌బెడ్ నుంచి నీటిని తీసుకెళ్తున్న ట్యాంకర్

రామవరం, ఏప్రిల్ 17: కార్మిక కాలనీల్లో తమకు తాగడానికి నీళ్లివ్వని సింగరేణి సివిల్ అధికారులు.. సంస్థ క్వార్టర్ల నిర్మాణాల క్యూరింగ్‌కు ఏకంగా ఫిల్టర్ బెడ్ నీళ్లనే వినియోగిస్తున్నారంటూ కార్మికులు, కార్మిక ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వారి కథనం ప్రకారం.. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్, గౌతంపూర్, ధన్‌బాద్ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య ఉంది. వీకే 7 షాఫ్ట్ మైన్ నీళ్లు సక్రమంగా రావడం లేదు. కొన్నిసార్లు అరకొరగా సరఫరా చేస్తున్నారు. దీంతో సరిపడా తాగునీళ్లు అందక కార్మిక ప్రాంతాల ప్రజలు అల్లాడుతున్నారు. ఇక్కడ ఇంతటి నీటి సమస్య ఉన్నప్పటికీ సింగరేణి సివిల్ అధికారులు పెద్దగా స్పందించడం లేదు. పైగా రుద్రంపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న క్వార్టర్ల క్యూరింగ్ కోసం ఏకంగా ఫిల్టర్‌బెడ్ నుంచి ఫిల్టర్ చేసిన నీటినే ట్యాంకర్ల ద్వారా తీసుకెళ్తారు. కనీసం గృహావసరాల కోసం కూడా సరిపడినన్ని నీళ్లు ఇవ్వని అధికారులు.. నిర్మాణాల కోసం ఏకంగా ఫిల్టర్ చేసిన వాటర్‌ను వినియోగిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. మైన్ నుంచి వచ్చే రా వాటర్‌ను క్యూరింగ్‌కి సరఫరా చేసుకొని.. తమకు ఫిల్టర్ బెడ్ వాటర్‌ను అందించాలని కోరుతున్నారు.

### కాలనీలకు ఇచ్చాకే తీసుకెళ్తున్నాం..

క్యూరింగ్ కోసం వాటర్ ఇస్తున్న మాట వాస్తవమే. కార్మిక ప్రాంతాల్లో బోర్లు వేసినా అక్కడ నీళ్లు పడక అవి ఫెయిల్ అవుతున్నాయి. అందుకే అక్కడి ఫిల్టర్ బెడ్ నీళ్లను క్యూరింగ్ కోసం ఇస్తున్నాం. అది కూడా కాలనీలకు సరఫరా చేశాకే క్యూరింగ్‌కు ఇస్తున్నాం.

**–రామకృష్ణ, సింగరేణి సివిల్ ఏజీఎం**

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఖమ్మం, ఏప్రిల్ 17 : సాధారణ లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఈ నెల 18వ తేదీ నుంచి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నారు. సాధారణ ప్రజలు 25వ తేదీ వరకు సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు మాత్రమే కలెక్టరేట్‌కు రావాలని కలెక్టర్ సూచించారు.